క్లుప్తంగా

బొత్సను సత్కరించిన మళ్ల



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

మల్కాపురం: ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను బుధవారం మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. బొత్స ఎన్నిక ఏకగ్రీవం కానుండడంతో శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్పొరేటర్లు పీవీసురేష్,ముర్రు వాణి, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావుతో పాటు నాయకులు దొడ్డి కిరణ్,దాడి సత్యనారాయణ (డిపో), శ్యామ్‌కుమార్,గొర్లె అప్పలరాజు,దొడ్డి సతీష్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ



చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్న భాస్కరరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్ నగర్ ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త, ప్రముఖ చిత్రకారుడు చెల్లూరి భాస్కరరావు చిన్నారులకు చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. చిన్నారులు తెలుపు పేపర్లు,రంగు పెన్సిల్స్,కలర్స్,ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

62వ వార్డులో మలేరియా పరీక్షలు



సామూహిక పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సింధియా : జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీలో ఇందిరానగర్ – 3 క్రాంతినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది సామూహిక మలేరియా రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ పర్యవేక్షించి వైద్య సిబ్బందికి రక్త నమూనాల సేకరణలో సూచనలు చేశారు. అనంతరం వార్డులో డ్రై డే – ఫ్రై డే అమలు తీరును పరిశీలించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, జీవీఎంసీ మలేరియా విభాగం సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీలు రమ్య, సత్యవతి, ఆశా కార్యకర్తలు రాణి, సుందరమణి, జయలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి ముందు నిలిపిన కారు మాయం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటి ముందు నిలిపిన కారు మాయమైంది. ఇంతవరకు బైక్‌లు, సైకిళ్లు ఎత్తుకుపోయిన దొంగలు ఇప్పుడు కార్లపై కన్నేశారు. ఆరిలోవ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. స్థానికుల ద్వారా తెలిసిన వివరాలిలా.. జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ వెటర్నరీ లేఅవుట్‌లో ఓ వ్యక్తి తన ఇంటి ముందు సోమవారం సాయంత్రం కారు పార్కింగ్ చేశాడు. మంగళవారం ఉదయం చూసేసరికి తన కారు కనిపించకపోవడంతో నిర్ఘాంతపోయాడు. ఎవరైనా ఎత్తుకెళ్లి ఎక్కడైనా విడిచిపెట్టేరేమోనని చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. ఎక్కడా కారు ఆచూకీ కానరాకపోవడంతో మంగళవారం రాత్రి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లేఅవుట్‌లో కొందరు ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు ఆ కారును ఎత్తుకు పోయినట్లు ఓ సీసీ ఫుటేజీలో వెల్లడైంది. కానీ వారు ఆ కారును ఎటుగా తీసుకువెళ్లారో స్పష్టత లేదు.



జనంతో రద్దీగా గోపాలపట్నం ప్రధాన రహదారి



కంచరపాలెం జాతీయ రహదారిపై పువ్వుల విక్రయాలు

మార్కెట్‌కు శ్రావణ శోభ

- రద్దీగా గోపాలపట్నం, కంచరపాలెం
- చీరలు, పువ్వులు, పూజా సామగ్రి కొనుగోలుదారులతో రద్దీ



గోపాలపట్నంలో వస్త్ర దుకాణం వద్ద జనం



కంచరపాలెంలో కళకళలాడుతున్న మార్కెట్లు

కంచరపాలెం/గోపాలపట్నం : మహిళలకు మంగళ ప్రదమైన శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతానికి అంతా సిద్ధమవుతున్నారు. చీరలు, పువ్వులు, పూజ సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు నిర్వాహకులు కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు రంగురంగుల విద్యుత్ దీపాలతో షోరూమ్స్‌ను అలంకరించారు. మరోవైపు ఆలయాల్లో మహిళలు మంగళగౌరీ వ్రతాలు ఆచరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు అనుగుణంగా కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, మర్రిపాలెం, మురళీనగర్, మాధవధార, అక్కయ్యపాలెం, సీతంపేట, సీతమ్మధార, జ్ఞానాపురం, ఎన్‌ఏడీ కొత్త రోడ్డు, గోపాలపట్నం ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహణకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. శ్రావణ శుక్రవారం సమీపించడంతో బుధవారం కంచరపాలెం, గోపాలపట్నం ప్రధాన రహదారులు రద్దీగా కనిపించాయి. వస్త్ర దుకాణాలు, పువ్వులు, పూజా సామగ్రి విక్రయించే షాపుల వద్ద జనం గుమిగూడారు. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌పై గాజులు, పువ్వులు విక్రయించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

ధరలు బాగా పెరిగిపోయాయి



శ్రావణ మాసంలో మహిళలంతా ఎంతో పవిత్రంగా వరలక్ష్మి వ్రతం జరుపుకుంటారు. ఇదే అదునుగా వ్యాపారులు ధరలు అమాంతంగా పెంచేశారు. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా ధరలు విపరీతంగా పెంచి విక్రయిస్తున్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా ఈ ఏడాది వరలక్ష్మి వ్రతం జరుపుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాం.

– చెంగాల ఆశాజ్యోతి, ఊర్వశి కూడలి

జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన



ఎన్ఎస్‌టీఎల్ ట్రైడెంట్ వద్ద జాతీయ జెండాతో విద్యార్థులు

విశాఖ విద్య: జాతీయ జెండాతో ఎన్ఏడీలో విద్యార్థులు చేసిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఏడీ నారాయణ పాఠశాల విద్యార్థులు బుధవారం జాతీయ నాయకుల వేషధారణలో బాజీ జంక్షన్ నుంచి ఎన్ఏడీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్‌టీఎల్ ట్రైడెంట్ వద్ద జాతీయ జెండాను ప్రదర్శించారు. ఏజీఎం రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, కో–ఆర్డినేటర్ రామ్ నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాఖ విద్య: దాతలు వృద్ధులను ఆదుకోవడానికి ముందుకు రావాలని జీవీఎంసీ నైట్ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అన్నారు. 90వ వార్డు పరిధిలో ఉన్న జీవీఎంసీ నైట్ షెల్టర్‌లో వృద్ధులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ కుటుంబ సభ్యులు బుధవారం అన్నదానం చేశారు. వృద్ధులకు మిఠాయిలను పంపిణీ చేశారు. రమణ కుమారుడు జశ్వంత్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నరవ పూడిరాజు, బలిరెడ్డి నాగేశ్వరరావు, గోపి పాల్గొన్నారు.

సమయపాలన ఎంతో అవసరం



ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హరినాథ్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

మల్కాపురం: ఏదైనా రంగంలో రాణించాలంటే సమయపాలన,కార్యదీక్ష ఉండాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సర్వసిద్ధి హరినాథ్ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో చేరిన నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు తమ నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలన్నారు. అవకాశాలను సృష్టించుకుంటూ విజయాలను సొంతం చేసుకోవాలని సూచించారు.విద్యా సంబంధ విషయాల్లోనే కాకుండా,జాతీయ సేవా పథకం ,క్రీడలు ,మేథోపరమైన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, కరస్పాండెంట్ గెసెల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్కాపురం : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీలో పునమశెట్టి వీర్రాజు (48)భార్య, కుమారుడితో కలిసి నివసిస్తున్నాడు. వీర్రాజు ఐఎన్ఎస్ ఏకశిలలో కాంట్రాక్ట్ పద్ధతిలో టైలర్‌గా పని చేస్తున్నాడు. ఇతను కొన్నాళ్లుగా మద్యానికి బానిస కావడంతోపాటు తనలో తానే మాట్లాడుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కుమారుడికి ఐఐటీలో సీటు రావడంతో అతడి భార్య తీసుకుని రెండు రోజుల కిందట చెన్నై (మద్రాస్) వెళ్లారు. ఈ క్రమంలో వీర్రాజు ఇంట్లో ఒక్కడే ఉండడంతో అతిగా మద్యం సేవించాడు. బుధవారం ఉదయం వీరి ఇంటికి ఎదురుగా ఉన్న శ్యామ్ అనే వ్యక్తి డబ్బుల కోసం వీర్రాజు ఇంటికి వెళ్లి చూడగా... గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ విద్యాసాగర్, ఎస్ఐ శ్యామలరావు సంఘటనా స్థలానికి చేరుకుని వీర్రాజు మృతిపై ఆరా తీశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా రాకపోకలకు అనుమతివ్వాలి

- డాక్‌యార్డ్ వద్ద ప్లకార్డులతో ఆందోళన చేసిన ఉద్యోగులు



డాక్‌యార్డ్ విజయనగర్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న నేవీ ఉద్యోగులు, కార్మికులు

సింధియా : ఎస్‌బీసీ వంతెన మీదుగా రాకపోకలకు అనుమతివ్వాలని నేవల్ సివిలియన్ ఎంప్లాయూస్ యూనియన్, ఇండియన్ నేవీ సివిలియన్ ఎంప్లాయూస్ యూనియన్ ఆధ్వర్యంలో డాక్‌యార్డ్ ఉద్యోగులు, కార్మికులు విజయనగర్ గేటు వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి సింధియా వైపు ప్రయాణ మార్గంలో ఉన్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ బ్రిడ్జి పునర్నిర్మాణం కారణంగా మూసివేయడంతో అటుగా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి సింధియా వైపు ప్రయాణ మార్గంలో వెళ్లే వారంతా బ్రిడ్జి మూసేయడంతో సుమారు 10 కిలోమీటర్లు దూరం ఎస్ఆర్ మీదుగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు. మరోవైపు ఈ క్రమంలో రోజూ ఎవరో ఒకరు ప్రమాదానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఎస్‌బీసీ వద్ద గల బ్రిడ్జి మీదుగా రాకపోకలకు అనుమతించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు ఉద్యోగులను హడలెత్తించిన పాము



పామును పట్టుకున్న కిరణ్ కుమార్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగులను పాము హడలెత్తించింది. బుధవారం యధావిధిగా ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. విధి నిర్వహణలో భాగంగా బ్యాంక్ సిబ్బంది స్టోర్ రూమ్‌కు వెళ్లారు. అక్కడ పాము తిరుగుతూ కనిపించింది. భయంతో పరుగులు తీశారు. దీంతో స్నేక్ క్యాచర్ ఆర్. కిరణ్ కుమార్‌కు బ్యాంక్ సిబ్బంది సమాచారం అందించారు. కిరణ్ కుమార్ బ్యాంక్‌కు చేరుకుని సుమారు 5 అడుగులు పొడవు కలిగిన పామును ఒడిసి పట్టుకున్నాడు. దీంతో బ్యాంక్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పామును యారాడ కొండపై అడవిలో వదిలిపెట్టినట్టు కిరణ్ కుమార్ తెలిపారు.

1280వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్షా శిబిరంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1280వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం దీక్షల్లో కూర్చున్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, ఎన్. రామారావు, నీరుకొండ రామచంద్రరావు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం విరమించు కోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి పదార్థాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఓబీసీ సంఘం నాయకులు బి. అప్పారావు, శ్రీనివాసరావు, ఉండవల్లి శ్రీనివాసరావు, దొడ్డి సన్నిబాబు దీక్షలో కూర్చున్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం

అగనంపూడి: దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కానిస్టేబుల్ చోడమ్మకు సీమంతం సందడిగా నిర్వహించారు. సీఐ ఎర్రం నాయుడు సమక్షంలో తోటి మహిళా కానిస్టేబుళ్లు చోడమ్మకు పద్ధతి ప్రకారం చీర, జాకెట్లు, పండ్లు, పూలు, స్వీట్లతో సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజలకు సేవ చేసినట్టే తమ తోటి కానిస్టేబుల్‌కు సీమంతం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, హెచ్‌సీలు రాజు, ప్రసాద్, సూరిబాబు, మహిళా సిబ్బంది సుశీల, స్పందన తదితరులు పాల్గొన్నారు.



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

మొక్కలు నాటిన ఎన్‌సీసీ క్యాడెట్లు



మొక్కలతో ఎన్‌సీసీ క్యాడెట్లు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్ 11 లోని శ్రీష్టి వరల్డ్ పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లు మొక్కలు నాటారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రతీ ఒక్కరూ తల్లి పేరున మొక్క నాటాలి అని ఇచ్చిన పిలుపు మేరకు 13వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్యాడెట్లకు వ్యాస రచన , వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి, ఈడీ డాక్టర్ కె. మేఘన, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్ దేవగిరి, వి. లత, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

అంధకారంలో వాకింగ్ పార్కు

ఇబ్బంది పడుతున్న వాకర్స్



వాకింగ్ ట్రాక్‌లో వెలగని లైట్లు



అంధకారం నడుమ వాకింగ్ చేస్తున్న వాకర్స్

మల్కాపురం: ఆ పార్కులో అంధకారం రాజ్యమేలుతోంది. ఒక్క లైటు కూడా వెలగక పోవడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. మరికొంత మంది సెల్ లైట్లు పట్టుకొని వాకింగ్ చేస్తున్నారు. అయినా అధికారులు వీటి నిర్వహణను పట్టించుకోవడం లేదని వాకర్స్ ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డులోని గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద విశాలమైన ప్రదేశంలో జీవీఎంసీ అధికారులు వాకింగ్,సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. సింధియా నుంచి జింక్ పరిసర ప్రాంత వాసులు రోజు ఇక్కడకు ఉదయం,సాయంత్రం సమయాల్లో వాకింగ్,వ్యాయామంతో పాటు కాలక్షేపానికి వస్తారు. వారి కోసం మంచి నీటి సౌకర్యం ,విశ్రాంతి తీసుకోవడానికి బల్లల ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు సదుపాయం కల్పించారు. అయితే ప్రస్తుతం ఇక్కడ వాకర్స్ సేద తీరేందుకు సిమెంట్ బల్లలు తప్పా మంచినీటి సౌకర్యం లేదు. మరగుదొడ్ల నిర్వహణ అంతంత మాత్రమే. విద్యుత్ ఎల్ఈడీ లైట్లు వెలగడం లేదు. ఇలా ఇక్కడ పలు సమస్యలు వేధిస్తున్నాయి.

ఆకతాయిల బెడద

పార్కులో అంధకారం అలముకోవడంతో ఆకతాయిల బెడద పెరిగింది. మందు బాబుల ఆగడాలు ఎక్కువ అయ్యాయి. మరి కొంత మంది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారని వాకర్స్ వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి లైట్లు వేయడంతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించాలని వాకర్స్ కోరుతున్నారు.

ఘనంగా ముగిసిన క్రీడా పోటీలు



క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలతో అతిథులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్‌కాలనీ క్రీడామైదానంలో షిప్‌యార్డ్ స్పోర్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు బుధవారం సాయంత్రంలో ముగిశాయి. సుమారు 200 మంది షిప్‌యార్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సొసైటీ సభ్యులు వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహించారు. వాలీబాల్‌లో డిజైన్ టీమ్, క్రికెట్‌లో వార్ ఆన్ టెర్రర్ టీమ్ విజేతలుగా నిలిచారు. సంస్థ స్ట్రేటజిక్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గిరిదీప్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉరుకులు పరుగుల సమాజంలో ప్రతి ఒక్కరికీ క్రీడలు చాలా అవసరమన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుజేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ ఐనయతుల్లా బేగ్, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులను గుర్తించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మర్రిపాలెం సమీపంలోని అంబేద్కర్ కాలనీ, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను బుధవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. గర్భిణులను గురించాలని, వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు అందించాలని, ఐరన్ మాత్రాలు అందజేయాలన్నారు. డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, ముఖ్యంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ శత శాతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లి కోసం రైతు బజారులో బారులు



రైతుబజార్‌లో ఉల్లిపాయల కోసం క్యూలో వినియోగదారులు

సీతమ్మధార : టమాటా ధరలు అందుబాటులోకి వచ్చాయని వినియోగదారులు సంతోషించే లోపే ఉల్లిపాయల ధరలకు రెక్కలు వచ్చేశాయి. రైతుబజార్లలో ఉల్లిపాయలు కిలో ధర రూ.42కి చేరుకుంది. మూడు రోజుల క్రితం రూ.35గా వున్న ధర అమాంతం ఆరు రూపాయల మేరకు పెరిగిపోవడం గమనార్హం. రైతుబజారుకి బుధవారం జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ నుంచి నాలుగు టన్నుల మేరకు ఉల్లిపాయలు వచ్చాయి. మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి విశాఖకు ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి. ఈ మేరకు సీతమ్మధార రైతుబజార్‌లో నాలుగు స్టాళ్లలో బుధవారం ఉల్లిపాయలు విక్రయించారు. వాటి కోసం వినియోగదారులు అధిక సంఖ్యలో బారులు తీరారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ వినియోగదారులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, 16న వరలక్ష్మి వ్రతం, 19న రక్షాబంధన్... ఇలా వరుసగా పండగలు వుండడంతో రైతుబజారుకు వచ్చే వినియోగదారుల రద్దీ అధికంగా వుంటుంది. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

వాల్తేర్ డివిజన్‌లో 'విభజన భయానక దినోత్సవం'



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు రోజు జరిగిన విభజన భయానక దృశ్యాలను గుర్తు చేసుకుంటూ వాల్తేర్ డివిజన్ పరిధిలో విభజన భయానక దినోత్సవం (పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే) బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఫొటోలతో ఎగ్జిబిషన్‌ను రైల్వేస్టేషన్ ఫొటో గ్యాలరీ వద్ద సీనియర్ డివిజినల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు భారతీయులు ఎన్నో కష్టాలు అనుభవించారన్నారు. డివిజన్ పరిధిలో గల విజయనగరం, శ్రీకాకుళం రోడ్, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్ స్టేషన్లలో కూడా ఈ దినోత్సవం నిర్వహించారు. అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.